ప్రజాశక్తి

ఆదివారం 24 ఆగస్టు 2025 | 5 | అనంతపురం





కడవకల్లు గ్రామంలో రోడ్డుపై నిలిచిన వర్షం నీరును తొలగించాలని అధికారులను ఆదేశిస్తున్న కలెక్టర్

ఇప్పటికీ 60 శాతం బీడే



◆ ఉమ్మడి జిల్లాలో ముందుకుసాగని ఖరీఫ్
◆ ఆగస్టులో వర్షాలొచ్చినా ప్రత్యామ్నాయం లేక ఖాళీ

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఖరీఫ్ సీజన్ ముగియడానికి వస్తున్నా ఇప్పటికీ 60 శాతం భూమిలో విత్తనం పడలేదు. 10.4 లక్షల ఎకరాలు బీడుగా ఉంది. 17.33 లక్షల ఎకరాల్లో ఈ ఏడాది పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ మొదట అంచనా వేసింది. ఈ మేరకు అనంతపురం జిల్లాలో 9.78 లక్షల ఎకరాలకుగాను విత్తనం పడింది 5.07 లక్షల ఎకరాల్లో. 60 శాతం సాగైంది. ఇక సత్యసాయి జిల్లాలో 7.55 లక్షల ఎకరాలకుగాను విత్తనం పడింది కేవలం 1.86 లక్షల ఎకరాల్లోనే అంటే సాధారణ సాగులో 34 శాతమే పంటలు సాగయ్యాయి. కీలకమైన జూన్, జులై నెలల్లో వర్షాలు లేకపోవడంతో రైతులు విత్తనం వేసుకోలేకపోయారు. ఆగస్టు మాసంలో మంచి వర్షాలొచ్చినప్పటికీ ప్రధాన పంట అయిన వేరుశనగ సాగుకు అదును దాటిపోయింది. దీంతో ఖరీఫ్ సాగు ఆశాజనకంగా సాగలేదు. అయితే ప్రభుత్వం సమయమున్నందున్న ఉద్దేశంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదు. ప్రత్యామ్నాయ విత్తనాలేకపోవడంతో ఇతర పంటల సాగు కూడా అంతంత మాత్రంగానే సాగింది.

గణనీయంగా తగ్గిన వేరుశనగ సాగు

ఉమ్మడి జిల్లాలో ప్రధాన పంట వేరుశనగ సాగు గణనీయంగా తగ్గింది. అనంతపురం జిల్లాలో 4.49 లక్షల ఎకరాలయితే సాగైంది కేవలం 1.71 లక్షల ఎకరాల్లోనే సాగైంది. సాధారణంలో 38 శాతమే సాగైంది. ఇక సత్యసాయి జిల్లాలో 3.75 లక్షల ఎకరాలు సాధారణ సాగయితే లక్ష ఎకరాల్లోనే విత్తనం వేశారు. 27 శాతమే అయింది. ఇక కంది పంట అయితే సాధారణం కంటే గణనీయంగా పెరిగింది. కంది అనంతపురం జిల్లాలో 1.36 లక్షల ఎకరాలయితే 1.93 లక్షల ఎకరాలయింది. సాధారణం కంటే 142 శాతం అధికమైంది. సత్యసాయి జిల్లాలో 71 వేల ఎకరాలయితే 52 వేల ఎకరాల్లో సాగైంది. సజ్జ పంట అనంతపురం జిల్లాలో సాధారణ సాగు 5075కు గాను 7583 ఎకరాల్లో 149 శాతం సాగైంది. సత్యసాయి జిల్లాలో రెండు ఎకరాలకుగాను 1341 ఎకరాల్లో అయింది. పత్తి, వరి ఇతర పంటలు కూడా సాధారణం కంటే తక్కువగానే సాగయ్యాయి.

అదునులో ప్రత్యామ్నాయం కరువు

ఖరీఫ్ సీజన్‌లో కీలకమైన జూన్, జులై నెలల్లో తీవ్ర వర్షాభావం నెలకొంది. ఆగస్టులో అధిక వర్షాలు నమోదయ్యాయి. కరువు మండలాల ప్రకటన జరగాలంటే ఆగస్టు ఆఖరు వరకు సీజన్‌ను చూసి ఇవ్వడం జరుగుతుంది. ఆ తరువాత కూడా వర్షాభావం ఉంటేనే కరువు పరిస్థితులు వచ్చినట్టు భావిస్తారు. ఆగస్టులో పెద్దఎత్తున ఉమ్మడి జిల్లాలో వర్షపాతం నమోదయింది. మొదటి రెండు నెలలు పడలేదు. రెండు నెలలు పడకపోవడంతో అదునులో పడునులేక రైతులు విత్తనం విత్తుకోలేకపోయారు. ఆగస్టులో వేసినా పెద్దగా పంటరాదన్న ఉద్దేశ్యంతో రైతులు ప్రధాన పంట వేరుశనగను సాగు చేయలేకపోయారు. దీంతో ఎప్పుడూలేనంత తక్కువగా వేరుశనగ ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో పడిపోయింది. ఇక ప్రత్యామ్నాయ విత్తనాలను ప్రభుత్వం అందుబాటులో ఉంచివుంటే ఆగస్టులో పడుతున్న వర్షాలతోనైనా పంటలు సాగుచేసుకునేందుకు వీలుండేదని రైతులు వాపోతున్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇద్దాం

కలెక్టర్ డా.వి.వినోద్‌కుమార్

ప్రజాశక్తి-పుట్లూరు

పరిశుభ్రతకు ప్రాధాన్యతను ఇచ్చేలా ప్రతి ఒక్కరూ ముందుకెళ్లాలని కలెక్టర్ డా.వి.వినోద్‌కుమార్ తెలియజేశారు. శనివారం నాడు మండల పరిధిలోని కడవకల్లు గ్రామంలో స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. 'వర్షాకాలం పరిశుభ్రత' అనే థీమ్‌తో గ్రామంలో ర్యాలీ నిర్వహించి, సర్కిల్‌లో స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం మొదలైన నేపథ్యంలో ఇళ్ల వద్ద నీటి నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. మురుగుకాలువలు లేని చోట వాటిని ఏర్పాటు చేస్తామన్నారు.


పలు కార్యక్రమాల్లో కలెక్టర్ బిజీబిజీ

పుట్లూరు మండల పర్యటనలో భాగంగా కలెక్టర్ పలు కార్యక్రమాల్లో బిజీబిజీగా గడిపారు. గ్రామంలో ఉపాధి హామీ కింద నిర్మిస్తున్న వ్యక్తిగత సోక్ పిట్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఉపాధి హామీ కింద మంజూరైన సిసి రోడ్డు, డ్రైనేజీ పనులను ప్రారంభించాలని డ్వామా పీడీకి కలెక్టర్ ఆదేశించారు. గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద మొక్కలు నాటారు. సంపద కేంద్రం చుట్టూ పిచ్చి మొక్కలను తొలగించాలని పంచాయతీ సెక్రెటరీని ఆదేశించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్లను పరిశీలించారు. పాఠశాలలో కమ్యూనిటీ సోక్ పిట్ ను పరిశీలించారు. పాఠశాల ప్లేగ్రౌండ్ కోసం అవసరమైన స్థలం గ్రామంలో గుర్తించాలని తహసీల్దార్‌కు కలెక్టర్ సూచించారు. షెడ్ మిత్రలు, క్లాప్ మిత్రలకు యూనిఫామ్ పంపిణీ చేసి వారిని శాలువా కప్పి సన్మానం చేశారు. ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమాల్లో డిపిఒ నాగరాజు నాయుడు, జెడ్పీ సీఈవో రామసుబ్బయ్య, డ్వామా పీడీ సలీమ్ బాషా, డ్వామా తాడిపత్రి ఏపీడీ పుల్లారెడ్డి, ఎపిఎం తులసిప్రసాద్, తహశీల్దార్ శేషారెడ్డి, ఈవోఆర్డీ శివప్రసాద్, సర్పంచి రామాంజనేయులు, హౌసింగ్ ఏఈ సంధ్య, పంచాయతీ సెక్రెటరీ ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

యూరియా కోసం ఆందోళన చెందొద్దు : కలెక్టర్

వర్షం బాగా రావడంతో యూరియాకు డిమాండ్ పెరిగిందన్నారు. యూరియా అక్రమ రవాణా నియంత్రణ కోసం జిల్లా స్థాయిలో టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేశామన్నారు. 50 శాతం యూరియా ప్రభుత్వం వద్ద ఉందని, 50 శాతం ప్రయివేటుకు ఇస్తామన్నారు. ప్రయివేటు వ్యాపారుల వద్ద యూరియా కావాలని అడిగితే యూరియాతోపాటు కాంప్లెక్స్ తీసుకోవాలంటూ ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఇలా చేసే వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. రైతులకు కావాల్సిన దానిని మాత్రమే ప్రయివేటు షాపుల వారు ఇవ్వాలన్నారు. రైతులకు అవసరమైన యూరియాను ఇస్తామని, ఇందులో ఎవరూ అపోహ పడాల్సిన అవసరం లేదన్నారు.

ఇళ్ల మధ్యకు చెరువు నీరు



ఇళ్ల మధ్యలో ఉన్న నీరు

ప్రజాశక్తి-యల్లనూరు

ఎగువ ప్రాంతంలో అధికంగా వర్షాలు కురవడంతో గండికోట రిజర్వాయర్ నుంచి యల్లనూరు, గడ్డంవారిపల్లి చెరువులకు నీటిని విడుదల చేశారు. పంట సాగులకు చెరువుల్లోనీ నీరు రైతులను వినియోగించుకుంటున్నారు. ఇటీవల ఈ నీటిని కొందరు తూముకు మళ్లించారు. ఇలా వస్తున్న క్రమంలో నీరు కాలువల నుంచి బయటకు వచ్చి ఇళ్ల మధ్యలోకి చేరింది. దీంతో నివాస ప్రాంత ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి నీరు వృథాగా కాకుండా చర్యలు చేపట్టాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

మరువ వంక పూడికతీత పనులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

నగరంలో గత కొన్ని రోజులుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రధాన కాలువలు మురుగునీటితో నిండిపోయాయి. ఈ పరిస్థితుల్లో ఎమ్మెల్యే దగ్గుపాటి అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. మరువ వంక, నడిమి వంకలో పూడిక లేకుండా చూడాలని ఆదేశించారు. మరువ వంకలో పిచ్చి మొక్కలు పెరిగిపోవడం, పూడిక ఎక్కువగా ఉండటంపై స్పందించారు. ముందు జాగ్రత్త చర్యలుగా పూడికతీత పనులు చేపట్టాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో ప్రస్తుతం మరువ వంకలో పూడిక తీత పనులు వేగవంతంగా సాగుతున్నాయి. మురుగునీటితో పాటు వర్షపు నీరు పెద్ద ఎత్తున వచ్చినా ప్రవాహానికి ఇబ్బంది లేకుండా పనులు చేస్తున్నారు.

అసంబద్ధాలను సరి చేయండి : యుటిఎఫ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఉమ్మడి అనంతపురం జిల్లా జడ్పీ భవిష్యనిధి ఖాతా అప్డేషన్‌లో తలెత్తిన అసంబద్ధాలను సరిచేయాలని యుటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.జయ చంద్రారెడ్డి, శ్రీసత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ శుక్రవారం నాడు ఆన్‌లైన్‌లో ఉంచిన జెడ్పీ భవిష్యనిధి ఖాతాల అప్డేషన్‌లో అనేక అసంబద్ధాలు నెలకొన్నాయన్నారు. 2023 -24 సంవత్సరానికి సంబంధించి కొంతమంది ఉపాధ్యాయులకు అప్డేషన్ కాలేదన్నారు. మరికొంతమంది ఉపాధ్యాయుల భవిష్యనిధి ఖాతా నుంచి ఎటువంటి రుణం తీసుకోకున్నా తీసుకున్నట్లు ఆన్లైన్‌లో చూపిస్తోందన్నారు. 2024-25 సంవత్సరాలనికి సంబంధించిన పిఎఫ్ షెడ్యూల్స్‌ను డిడిఒల నుంచి వెంటనే తెప్పించుకుని వాటిని కూడా త్వరగా అప్డేట్ చేయాలని డిమాండ్ చేశారు.

ఈవీఎం గోడౌన్ల తనిఖీ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఈవీఎం గోడౌన్ల వద్ద పటిష్టమైన భద్రత ఉండాలని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం అనంతపురం నగరంలోని పాత ఆర్డీవో కార్యాలయం కాంపౌండ్ పక్కనున్న ఈవీఎం గోడౌన్లను తనిఖీ చేశారు. భద్రతా చర్యలు, లాక్ బుక్‌లను పరిశీలించి అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట డిఆర్ఒ ఎ.మలోల, కలెక్టరేట్ కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ యుగేశ్వరి దేవి, తహశీల్దార్ హరికుమార్, ఎన్నికల విభాగం డిప్యూటీ తహశీల్దార్ కనకరాజ్ పాల్గొన్నారు.

జెఎన్‌టియుకు ఐఎస్‌ఒ సర్టిఫికెట్ గర్వకారణం

విసి హెచ్.సుదర్శనరావు

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు విశ్వవిద్యాలయానికి ఇంటర్నేషనల్ ఆర్గనైజషన్ ఫర్ స్టాండర్డిజషన్ (ఐఎస్‌ఒ) రావడం గర్వకారణమని ఉపకులపతి హెచ్.సుదర్శనరావు అన్నారు. శనివారం స్థానిక జెఎన్‌టియు ఉపకులపతి కాన్ఫరెన్స్ హాలులో సర్టిఫికేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎస్‌ఓ బృందం సభ్యులు యూనివర్సిటీలోని అన్ని విభాగాలు, ఇంజినీరింగ్ కళాశాల, ఓటీపీఆర్ఐలో అన్ని విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించి సూచనలు, సలహాలను అందజేశారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ విశ్వవిద్యాలయానికి 6 నాణ్యత ప్రమాణాల సర్టిఫికెట్లు రావడం ఎంతో గర్వకారణమన్నారు. ఈ నాణ్యత ప్రమాణాలను కాపాడుకోవాల్సిన అవసరం మన అందరిపైన ఉందని తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని ప్రమాణాలను మెరుగు పరుచుకోవడానికి మనం అందరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, ఒఎస్‌డి విసి ఎన్.దేవన్న, ఐక్యూఎసి డైరెక్టర్ పద్మసువర్ణ, ఓటిపిఆర్ఐ డైరెక్టర్ జివి సుబ్బారెడ్డి, కళాశాల వైస్ ప్రినిపాల్ ఎస్.వసుంధర, తదితరులు పాల్గొన్నారు.



ఐఎస్‌ఒ సర్టిఫికెట్‌ను చూపుతున్న అధికారులు

మహనీయుడు 'ఆంధ్రకేసరి'

జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్‌శర్మ



టంగుటూరి ప్రకాశం పంతులకు నివాళి అర్పిస్తున్న జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు ఆంధ్ర రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించారని, ఆయన జీవితం స్ఫూర్తిదాయకం అని సంయుక్త కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ తెలిపారు. శనివారం ఉదయం స్థానిక కలెక్టరేట్ మినీ మీటింగ్ హాల్‌లో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో ప్రకాశం పంతులు చూపిన తెగువ, ధైర్యం నిరుపమానం అన్నారు. సైమన్ గో బ్యాక్ అంటూ బ్రిటీష్ వారి తుపాకీ గుండ్లకు ఎదురొడ్డి నిలిచి ఆంధ్రకేసరిగా పేరుగడించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఏ.మాలోల, అనంతపురం ఆర్‌డిఓ కేశవ నాయుడు, డీఎస్పీ శ్రీనివాస రావు, అశ్రఫ్ అలీ, జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్ బాబు, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి బాలకొండయ్య, జిల్లా పర్యాటక శాఖ అధికారి జయకుమార్, కలెక్టరేట్ ఏవో అలెగ్జాండర్, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

అందరి సహకారంతో వినాయకచవితి ఉత్సవాలు

వినాయక చవితి ఉత్సవాలను సంబంధిత శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ శర్మ తెలిపారు. ఈ నెల 27 నుండి 31వ తేదీ వరకు నిర్వహిస్తున్న గణేష్ చతుర్థి ఉత్సవాలపై సంబంధిత శాఖలు, ఉత్సవ కమిటీ సభ్యులతో శనివారం నాడు కలెక్టరేట్ మినీ కాన్ఫిరెన్స్ హాల్లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ వినాయక చతుర్థి ఉత్సవాలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా అన్ని చర్యలూ తీసుకోవాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. పర్యావరణానికి హాని కలగకుండా మట్టి వినాయకులను వాడేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎ.మలోల, అనంతపురం ఆర్డీవో కేశవ నాయుడు, డీఎస్పీ శ్రీనివాసరావు, ట్రైనీ డీఎస్పీ అశ్రఫ్ అలీతో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రాజ్యమేలుతున్న ఎరువుల మాఫియా

వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు అనంతవెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

ఇప్పటి వరకూ ల్యాండ్ మాఫియా, శాండ్ మాఫియా, లిక్కర్ మాఫియా చూశామని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎరువుల మాఫియాను చూస్తున్నామని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. శనివారం నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎరువుల మాఫియా వెనుక టీడీపీ నేతల హస్తం ఉందని ఆరోపించారు. కేంద్రం నుంచి వచ్చిన యూరియా, డిఎపి వంటి ఎరువులను బ్లాక్ మార్కెట్‌కు తరలించడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందన్నారు. యూరియా సరఫరాలో ముఖ్యమంత్రి చంద్రబాబు పూర్తిగా విఫలం అయ్యారని మండిపడ్డారు. యూరియా కోసం రైతులు పడుతున్న ఇబ్బందులు చంద్రబాబుకు పట్టడం లేదన్నారు. పంటల సాగు సమయంలో యూరియా, డీఏపీ డిమాండ్ ఉంటుందన్న విషయం సీఎంకు తెలియదా? అని ప్రశ్నించారు. కేంద్రం నుంచి వచ్చిన యూరియా, డీఏపీ వంటి ఎరువులు ఎక్కడికెళ్లాయో చెప్పాలని డిమాండ్ చేశారు. డిస్ట్రిబ్యూటర్ల నుంచి నేరుగా బ్లాక్ మార్కెట్ కు యూరియా తరలివెళ్తోందని ఆరోపించారు. దీనిపై ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి ఎందుకు సమీక్ష జరపలేదని నిలదీశారు. వెంటనే సిఎం, సంబంధిత మంత్రి స్పందించి యూరియా కొరతను తీర్చాలని డిమాండ్ చేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత : డీఎల్పీవో

ప్రజాశక్తి-నార్పల

స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని శనివారం మండల కేంద్రంలో నిర్వహించారు. డిప్యూటీ ఎంపీడీవో శైలజా రాణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్ జనార్ధన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డిఎల్‌పిఒ విజయ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. పంచాయతీ కార్యాలయంలో గ్రామసభను నిర్వహించారు. అంతకుమునుపు గ్రామస్తులతో కలిసి పంచాయతీ కార్యాలయం నుంచి గాంధీ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎల్‌పిఒ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకోవాలన్నారు. నివాస ప్రాంతాల్లో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మేజర్ పంచాయతీ సర్పంచి మన్నిల సుప్రియ, ఉప సర్పంచి గవ్వల శ్రీరాములు, మేజర్ పంచాయతీ కార్యదర్శి శ్యామల, కార్యదర్శులు పరశురాం, శ్రీనాథ్, పవన్ కుమార్, వెలుగు సిసి రత్నకుమారి పాల్గొన్నారు.

నకిలీ పురుగు మందు సీజ్

బేయర్ కంపెనీ పేరుతో నకిలీలు
117 కేసులు సీజ్ చేసిన వ్యవసాయాధికారులు



ఫర్టిలైజర్స్ షాపులో తనిఖీలు చేస్తున్న వ్యవసాయ అధికారులు

ప్రజాశక్తి-అనంతపురం

నకిలీ పురుగుమందులను వ్యవసాయాధికారులు శనివారం సాయంత్రం సీజ్ చేశారు. బేయర్ కంపెనీకి సంబంధించిన సొలోమెన్ 500 ఎంఎల్ అనే రకంను డూప్లికేట్ చేసి అనంతపురం నగరంలోని ఒక డీలర్‌కు సప్లై చేశారు. ఈసమాచారం వ్యవసాయాధికారులకు అందటంతో అనంతపురం ఎడిఎ అల్తాఫ్ అలీఖాన్, మండల వ్యవసాయాధికారి వెంకటకుమార్ నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని శ్రీ సంజీవరాయ ఫర్టిలైజర్సులో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 117 కేసులు బేయర్ కంపెనీకి సంబంధించి సొలోమెన్ 500 ఎంఎల్ పిచికారి మందు ఉన్నట్టుగా గుర్తించారు. బేయర్ కంపెనీకి సంబంధించి లేబుళ్ల అన్నీ ఉన్నప్పటికీ వ్యవసాయాధికారుల విచారణలో అవి ఆ కంపెనీకి సంబంధించినవి కాదని, డూప్లికేట్‌ని ప్రాథమిక అంచనాకు వచ్చారు. దీంతో వచ్చిన సరుకు మొత్తాన్ని సీజ్ చేశారు. సరుకు ఎక్కడి నుంచి వచ్చిందన్న వివరాలను సేకరించారు. మహేశ్ ఎంటర్ ప్రైజెస్ అకోలా నాగపూర్ నుంచి ఆదిత్య లాజిస్ట్ నుంచి వచ్చినట్టు బిల్లులున్నాయి. మార్కెట్ ధర ప్రకారం దీని విలువ రూ.29 లక్షల వరకు ఉండవచ్చునని అంచనా వేస్తున్నారు. దీనిపై నగరంలోని ఒన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు అల్తాఫ్ అలీఖాన్ తెలిపారు. సీజ్ చేసిన మందును ఫోరెన్సిక్ ల్యాబ్‌కు కూడా తదుపరి విచారణ నిమిత్తం పంపుతున్నట్టు ఆయన పేర్కొన్నారు.

గడువులోగా 'తుంగభద్ర' కొత్త గేట్ల ఏర్పాటు పూర్తి కావాలి

టిబి బోర్డు అధికారులతో విప్ కాలవ



తుంగభద్ర ప్రాజెక్టు వద్ద కొత్తగా తయారుచేసిన గేటును పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

తుంగభద్ర ప్రాజెక్టు కొత్తగేట్ల ఏర్పాటు గడువులోగా పూర్తి చేయాలని విప్ కాలవ శ్రీనివాసులు టీబీ బోర్డు అధికారులను ఆదేశించారు. తుంగభద్ర ప్రాజెక్ట్ గేట్ల భద్రతపై రైతుల్లో ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో శనివారం టిబి ప్రాజెక్టును పరిశీలించిన అనంతరం బోర్డు అధికారులతో కాలవ సమీక్ష నిర్వహించారు. భారీ వరద కారణంగా తుంగభద్ర ప్రాజెక్టు 19వ నెంబర్ గేట్ గతేడాది నదిలో కొట్టుకుపోయిన విషయం విధితమే. దీంతో కొద్దిరోజుల పాటు నీరు వృథాగా పోయింది. అప్పట్లో డ్యాంలో ఇతర గేట్ల భద్రతపై కూడా అనేక అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ సందర్భంగా నీటిపారుదల నిపుణులు కన్నయ్య నాయుడు ఆధ్వర్యంలో స్టాప్ లాగ్ గెట్ ఏర్పాటు చేయించి నీటి వృథాకు అడ్డుకట్ట వేశారు. అనంతరం సిడబ్ల్యూసి నిపుణుల బృందం ప్రాజెక్టును పరిశీలించి పాతగేట్ల స్థానంలో కొత్త వాటిని అమర్చాలని సిఫార్సు చేసింది. అందుకు ఆంధ్ర, కర్ణాటక ప్రభుత్వాలు అంగీకరించడంతో కొత్తగేట్ల ఏర్పాటు పనులను గుజరాత్‌కు చెందిన ఓ కంపెనీకి తుంగభద్ర బోర్డు అప్పగించింది. సంబంధిత కంపెనీ ఆధ్వర్యంలో తుంగభద్ర డ్యాం గేట్ల నిర్వహణ యార్డులో కొత్త గేట్ల నిర్మాణ పనులు సాగుతున్నాయి. డ్యాంలో 33 గేట్లు అమర్చాల్సి ఉండగా ఇప్పటి వరకు ఆరు గేట్లను తయారు చేశారు. మూడు గేట్లను గదగ్, మరో మూడు గేట్లు డ్యామ్ వద్ద ఉంచారు. సిద్ధమవుతున్న గేట్లను కాలవ శ్రీనివాసులు పరిశీలించి అధికారులతో వాటి పురోగతిపై చర్చించారు. ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాలకు ఈ ప్రాజెక్టు వరప్రసాదినిగా ఉన్నందున (జూన్ 2026) గడువులోగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గేట్ల ఏర్పాటు అంశాన్ని, పనుల పురోగతిని ఎప్పటికప్పుడు అడిగి తెలుసుకుంటున్నారని వివరించారు. వెనుకపడ్డ ప్రాంతాలకు సాగు, తాగునీరు అందిస్తున్న కీలకమైన ప్రాజెక్టు విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఎట్టి పరిస్థితుల్లో నిర్దేశించిన గడువులోగా కొత్తగేట్ల ఏర్పాటు ప్రక్రియ పూర్తి కావాలని అధికారులను ఆదేశించారు.

బీడీ కార్మికులకు న్యాయం చేయండి

ఏపీ బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఉమా గౌడ్

ప్రజాశక్తి-తాడిపత్రి

సంవత్సరాల తరబడి బీడీ కార్మికులుగా కొనసాగుతూ తలదాచుకోవడానికి సొంతిళ్లు లేక ఇబ్బంది పడుతున్న బీడీ కార్మికులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసి ఆదుకోవాలని ఏపీ బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఉమా గౌడ్ డిమాండ్ చేశారు. ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరుతూ ఏపీ బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో తాడిపత్రి పట్టణంలోని ట్రైలర్స్ కాలనీ సచివాలయ అధికారులకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఆరిఫా మాట్లాడుతూ బీడీ కార్మికులు గత 20 సంవత్సరాలుగా ఈ వృత్తిపైనా ఆధారపడి జీవనం సాగిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం వీరి సంక్షేమం గురించి పట్టించుకోవడం లేదన్నారు. 1000 బీడీలు చుడితే కేవలం వీరికి రూ.2.25పైసలు మాత్రమే డబ్బులు వస్తాయన్నారు. ఇంత తక్కువ వేతనంతో వారి కుటుంబాల జీవనం చాలా కష్టంగా ఉందన్నారు. కనీసం ఉండేందుకు వీరికి సొంతిళ్లు కూడా లేవన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం, అధికారులు స్పందించి వెంటనే వీరికి ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు షాను, భవాని బసిరున్, బీడీ కార్మికులు పాల్గొన్నారు.



సచివాలయం వద్ద బీడీ కార్మికులు, యూనియన్ నాయకుల నిరసన

సినిమా చిత్రీకరణ

బొమ్మనహాల్ : మండల పరిధిలోని నేమకల్లు గ్రామ సమీపంలో ప్రధాన రహదారి అయిన కణేకల్–బళ్లారి మధ్యలో అరటి తోటలో కొత్త చిత్రం షూటింగ్ చేశారు. ఈ సందర్భంగా సినిమా డైరెక్టర్ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ హీరో జగదీష్, హీరోయిన్ సహారా, హీరోయిన్ తల్లి కల్పలతపై సన్నివేశాలను చిత్రీకరించినట్లు తెలిపారు.



వేగంగా పనులు చేస్తున్న కార్మికులు

శరవేగంగా పాఠశాల భవన నిర్మాణాలు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

కళ్యాణదుర్గం మండలం పాలవాయి గ్రామంలో అర్థాంతరంగా ఆగిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవన నిర్మాన పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తన సొంత నిధులతో ఎస్ఆర్‌సి ట్రస్టు ద్వారా రూ.50లక్షలతో పనులను ప్రాంభించారు. ఇప్పటికే పాఠశాల గోడలు, ప్లాస్టింగ్ పనులు చకచకా సాగుతున్నాయి. మరోవైపు భవనాలకు అమర్చేందుకు అవసరమైన తలుపులు, కిటికీలు, టైల్స్ ఇప్పటికే పాఠశాలకు చేరుకున్నాయి. ఆయా పనులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేషులు, అమరా రామ్మోహన్‌చౌదరి దగ్గరుండి పనులను పర్యవేక్షిస్తున్నారు. దీంతో గ్రామస్థులు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

ప్రజాసమస్యలు గాలికి..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



ప్రజా సమస్యలు గాలికొదిలి నేతలు ఇతర సమస్యలపై ఎక్కువ దృష్టి పెడుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వారంలో చోటు చేసుకుంటున్న రాజకీయ పరిణామాలుగాని, ముందుకొచ్చిన సమస్యలుగాని చూస్తే అదే స్పష్టమవుతోంది. ఉమ్మడి జిల్లాలో ఈ వారంలో అనేక సమస్యలు ముందుకొచ్చాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన జూన్, జులై మాసాల్లో వర్షాలు సరిగా లేక రైతులు పంటలను సాగు చేసుకోలేకపోయారు. ఉమ్మడి జిల్లాలో దాదాపు 60 శాతం భూమిలో విత్తనం పడలేదు. రైతులు ఆకాశం వైపు ఎదరుచూస్తు చూస్తూ ఆగస్టులో మంచి వర్షాలే పడ్డాయి. అయితే ప్రధాన పంటల సమయం ముగిసింది. ప్రత్యామ్నాయం పంటలకే ఇది అనువైంది. ఆ పంటలు వేసుకుందామంటే ప్రభుత్వం ప్రత్యామ్నాయం విత్తనాలను సిద్ధం చేసిలేదు. దీంతో రైతులే సాగుకు రకరకాలుగా తిప్పలు పడుతున్నారు. కాకపోతే డబ్బులు పెట్టి కొందామన్న యూరియా దొరకడం లేదు. యూరియాని దొరికిచ్చుకోవడం రైతులకు తీవ్రమైన ఇబ్బందులు తప్పడం లేదు. ఈ సమస్యకు పరిష్కారం కోసం ప్రయత్నం చేసిన ఒక్క నేత కూడా జిల్లాలో కనిపించలేదు. అధికారులదే ఆ బాధ్యత అన్నట్టుగా వారిపై నెట్టేశారు. ఇక వికలాంగుల పింఛన్ల సమస్య మరింత ముందుకొచ్చింది. ఎన్నో సంవత్సరాలుగా పింఛను అందుకుంటున్న వారికి కూడా ఇక నుంచి పింఛను రాదంటూ నోటీసులు జారీ చేశారు. దీంతో దివ్యాంగులు పింఛను కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అనంతపురం జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఇప్పటికీ వారి ఆందోళనలు సమసిపోలేదు. నిలబెట్టుకోవడానికి కార్యాలయాల వద్దకు ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇక ఖరీఫ్ సీజన్ ముగియడానికి వచ్చినా ఇప్పటికీ సాగునీటి సలహా మండలి సమావేశం నిర్వహించలేదు. ఏ ఆయకట్టుకు ఎప్పుడు నీరిస్తారన్న దానిపై స్పష్టతలేదు. ఒకవైపు హంద్రీనీవా, తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువకు నీరొస్తున్నా నీటిని అందించే విషయంలో నేతలు దృష్టి సారించడం లేదన్న విమర్శలున్నాయి.

రాజకీయంగా పెద్ద దుమారం రేపిన ఘటనలు రెండు చోటు చేసుకున్నాయి. ఒకటి అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే సినీహీరో జూనియర్ ఎన్టీఆర్‌పై చేసిన వ్యాఖ్యలు రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ చర్చనీయాంశమయ్యాయి. ఆయనపై జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు మండిపడుతున్నారు. ప్రతిపక్ష పార్టీ నేతలు కూడా దగ్గుబాటివైపు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అంతకు మునుపు ఆయన చుట్టూ భూవివాదాలు పెద్దఎత్తున చోటు చేసుకున్నాయి. అనంతపురం నగరంలో జరుగుతున్న వివాదాలకు ఎమ్మెల్యే కారణమని మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి ఆరోపించడం చర్చనీయాంశమైంది. తాడిపత్రిలో వైసిపి, టిడిపిల మధ్య పోరు తీవ్ర స్థాయిలోనే జరిగింది. కోర్టు ఉత్తర్వుల మేరకు తాడిపత్రి పట్టణంలోకి ప్రవేశిస్తానని కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రయత్నించారు. కాని పోలీసులు అడ్డుకుని ఆయన్ను తిరిగి వెనక్కు పంపించారు. మరోమారు ఆయన న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఇప్పటికైనా అనుమతించాలని వైసిపి నాయకులు డిమాండ్ చేస్తున్నారు. జిల్లా ఎస్పీని కలసి మరోమారు విజ్ఞప్తి చేశారు. ఈ ఇద్దరి మధ్య వివాదం ఇప్పటికీ సద్దుమణగలేదు. నేతలు ఈ గొడవల్లో ఉండగా ప్రజాసమస్యలు మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రజా సమస్యలను గాలికొదిలేసి వారివారి సమస్యలు తలమునకలై ఉన్నారు.

సమస్యపై అధికారుల స్పందన

రోడ్డు గుంతలు పూడ్చివేత

ప్రజాశక్తి-శింగనమల



రోడ్డుకు మట్టి వేస్తున్న దృశ్యం

మండల పరిధిలోని తరిమెల గ్రామంలో గత నాలుగు రోజులు క్రితం వర్షాలు రావడంతో రోడ్డంతా నీళ్లతో గుంతలు మయం అయ్యి బురదమయంగా మారింది. ఈ రోడ్డుపై రాకపోకలు సాగించేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ సమస్యను సిపిఎం నాయకులు భాస్కర్ ఆధ్వర్యంలో శనివారం నాడు ప్రజాశక్తిలో కథనం ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన గ్రామ సచివాలయ పంచాయతీ అధికారులు, సర్పంచి ఓబులేసు ఆధ్వర్యంలో పరిష్కార చర్యలను చేపట్టారు. జెసిబి, ట్రాక్టర్లను ఏర్పాటు చేసి గుంతలు పడిన రోడ్డుపై ఎర్రమట్టిని తోలించారు. గుంతలు పూడ్చి చదును చేయించారు. దీంతో సమస్య తీరింది. సమస్యపై వెంటనే స్పందించి పరిష్కరించిన పంచాయతీ అధికారులు, గ్రామ సర్పంచి ఓబులేసుకు సిపిఎం మండల కార్యదర్శి భాస్కర్ కృతజ్ఞతలు తెలిపారు.

జోనల్ స్థాయిలో 6వ ర్యాంకు

ఉరవకొండ : ఉరవకొండ మండల పరిధిలోని ఆమిద్యాల గ్రామానికి చెందిన వి.మౌనిక డీఎస్సీ ఫలితాల్లో ప్రతిభ చాటింది. పిఈటి విభాగంలో జోనల్ స్థాయిలో 6వ ర్యాంకు సాధించి సత్తా చాటింది. మౌనిక తల్లితండ్రులు లింగమ్మ, స్వామిలు వ్యవసాయం కూలి పనులు చేసుకుంటూ కుమార్తెను చదివించారు. మౌనిక ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు ఆమిద్యాల ప్రభుత్వ ఎలిమెంటరీ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో చదువుకుంది. చిన్నప్పటి నుంచి కోకో ఆటలో మంచి ప్రతి కనబరిచేది. వ్యాయామ ఉపాధ్యాయురాలు అవ్వాలన్న లక్ష్యంతో కష్టపడి చదివి అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంది. మౌనిక పిఇటిగా ఎంపిక అవడంపై గ్రామస్తులు, క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

రెవెన్యూ పెట్రోల్ బంక్‌కు స్థలం సిద్ధం చేయండి

తాడిపత్రి రూరల్ : రెవెన్యూ పెట్రోల్ బంక్ ఏర్పాటు కోసం అవసరమైన భూమిని సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. శనివారం తాడిపత్రి మండలం పెద్దపొలమడ గ్రామం పరిధిలో అనంతపురం–తాడిపత్రి జాతీయ రహదారి పక్కన సర్వేనెంబర్ 1390లో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే పెట్రోల్ బంకు కోసం కలెక్టర్ స్థల పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సోమశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరకు ఎరువులు విక్రయిస్తే చర్యలు

బెలుగుప్ప : మండలంలోని ఎరువుల దుకాణదారులు అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవని తహశీల్దార్ అనిల్‌కుమార్ హెచ్చరించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం మండల కేంద్రంలోని గురుశ్రీ ఎరువుల దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా దుకాణంలో రికార్డులతోపాటు ఎరువులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా యూరియా అందుబాటులో ఉందా.. లేదా.. అని ఆరాతీశారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులను విక్రయించాలన్నారు. ఈ తనిఖీల్లో మండల వ్యవసాయ అధికారి పృథ్వీసాగర్, ఎఎస్ఐ రామదాసు, తదితరులు పాల్గొన్నారు.

స్త్రీ శక్తి అమలుకు సిఎం కృషి : విప్ కాలవ

ప్రజాశక్తి-రాయదుర్గం

విప్ కాలవ శ్రీనివాసులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న విప్ కాలవ

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో స్త్రీ శక్తి అభ్యున్నతికి విశేష కృషి చేస్తున్నారని విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. స్త్రీశక్తి పథకం విజయవంతంగా అమలైన సందర్భంగా శనివారం పట్టణంలోని మహిళా సంఘాల సభ్యులు పట్టణంలోని సీతారామాంజనేయ సత్రంలో టిడిపి నాయకురాలు బండి భారతి అధ్యక్షత సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ స్త్రీ శక్తి పథకం అమలుపై మహిళలు పెద్దఎత్తున చంద్రబాబుపై అభినందనలు వెల్లువెత్తుతున్నాయన్నారు. కుటుంబంలో కీలకమైన వ్యక్తిగా ఉన్న మహిళలకు అన్న ఎన్‌టిఆర్ సమాన ఆస్తి హక్కు, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించారని గుర్తు చేశారు. పొదుపు సంఘాల ఏర్పాటు ద్వారా మహిళలు బలమైన ఆర్థిక శక్తిగా ఎదగడానికి ప్రస్తుతం సిఎం చంద్రబాబు ఎనలేని కృషి చేశారన్నారు. ఆయన నాయకత్వంలో సూపర్ సిక్స్ పేరిట ఎన్నికల ముందు చేసిన వాగ్దానాల్లో ఐదింటిని అమలు చేసినట్లు చెప్పారు. మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం ద్వారా మహిళలు పెద్ద ఎత్తున డబ్బు ఆదా చేసుకున్నట్లు తెలిపారు. త్వరలోనే మహిళలకు నెలకు 1500 రూపాయల పథకాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. అనంతరం విప్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సభలో కమిషనర్ దివాకర్‌రెడ్డి, మెప్మా టిఎంసి నారాయణరెడ్డి, వార్డు సభ్యులు ప్రశాంతి, పద్మజ, మాజీ సభ్యులు నాగమణి, సంపత్‌కుమారి, మాజీ ఎంపీపీ పుష్పవతి, మున్సిపల్ వార్డు సభ్యురాలు జ్యోతి, టిడిపి నాయకులు హనుమంతు, పురుషోత్తం, వెంకటేశులు, మహబూబ్ బాషా, కృష్ణమూర్తి, ఇనాయత్‌బాషా, లావణ్య, ఉమ, సుమలత, గౌరీ, పట్టణంలోని మహిళలు పాల్గొన్నారు.

ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

కళ్యాణదుర్గం టౌన్ : ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని ఆర్డీవో వసంత బాబు హెచ్చరించారు. శనివారం స్థానిక కార్యాలయంలో కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల పరిధిలోని విత్తన, పురుగుల మందులు, ఎరువుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేకించి యూరియ అమ్మకాల్లో అక్రమాలు జరిగితే ఉపేక్షించమన్నారు. 2025 ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు దుకాణాల వారీగా రైతులకు యూరియ విక్రయించిన వివరాలను సమర్పించాలని ఆదేశించారు. అనుమతి పొందిన విత్తనాలు, ఎరువులు, పురుగులు మందులు మాత్రమే అమ్మకాలు జరపాలన్నారు. లేని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎడిఎ యల్లప్ప, డివిజన్ పరిధిలోని అన్నిమండలాల వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

వినాయక ప్రతిమల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

యాడికి : వినాయక ప్రతిమల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి అని సిఐ ఈరన్న శనివారం ఒక ప్రకటనలో కోరారు. మండపాల నిర్వాహకులు వెబ్‌సైట్, సింగిల్‌విండో, ఆన్‌లైన్‌లో గానీ అనుమతులు పొందవచ్చన్నారు. అనుమతులు పొందడానికి ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న తర్వాత, సంబంధిత పోలీస్ అధికారి మండప స్థలాన్ని తనిఖీ చేసి, నిబంధనల ప్రకారం ఉంటే క్యూఆర్ కోడ్ తో కూడిన నిరభ్యంతర పత్రాన్ని జారీ చేస్తారన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

రాయదుర్గం : జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ, రాయదుర్గం ప్రాంతీయ ఆసుపత్రి ఐసిటిసి విభాగం, మున్సిపాలిటీ శానిటరీ ఇన్స్‌పెక్టర్ రవీంద్ర ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహినంచారు. ఇందులో భాగంగా హెచ్ఐవి, ఎయిడ్స్, సుఖవ్యాధులు, క్షయవ్యాధి, మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాస్ ఎడ్యుకేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ నీలకంఠ, ఐసీటీసీ కౌన్సిలర్ కృష్ణమూర్తి, టిబి యూనిట్ ల్యాబ్ టెక్నీషియన్ సురేష్, ప్రివేన్షన్ యూనిట్ అకౌంటెంట్ లోకేష్, నాగమణి, సచివాలయ శానిటరీ కార్యదర్శులు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తిని దైవంగా భావించాలి

ప్రజాశక్తి-అనంతపురం సిటీ



ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి

ఉపాధ్యాయులు తమ వృత్తిని దైవంగా భావించాలని నగరంలోని హౌసింగ్ బోర్డులో ఉన్న రహమ్మత్ ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయిని ఇ.రాజేశ్వరి తెలిపారు. ఈనెల 31వతేదీన ఉద్యోగ విరమణ సందర్భంగా ప్రజాశక్తితో మాట్లాడుతూ తాను 1982లో టిటిసి చేసి 1983లో బుక్కరాయసముద్రం మండల పరిధిలోని రేగడికొత్తూరు పాఠశాలలో ఉపాధ్యాయునిగా చేరానన్నారు. రేగడికొత్తూరు గ్రామంలో 16ఏళ్లు, రోటరీపురంలో రెండేళ్లు, అనంతపురంలోని నగరంలోని అశోక్‌నగర్ సాయిబాబా ప్రైమరీ స్కూల్‌లో 25ఏళ్లపని చేశానన్నారు. ఈ సంవత్సరమే జూన్ నెలలో ప్రధానోపాధ్యాయినిగా హౌసింగ్ బోర్డు రహమత్ ప్రైమరీ స్కూల్‌కు బదిలీ అయ్యానన్నారు. ఉపాధ్యాయినిగా పని చేస్తూనే 1990లో ప్రయివేట్‌గా కట్టుకుని బిఎ, ఎంఎ, ఎస్‌వి యూనివర్సిటీలో బీఈడీ పూర్తి చేశానన్నారు. తన భర్త నాగేశ్వరరావు కూడా ప్రభుత్వ ఉపాధ్యాయునిగా బ్రహ్మసముద్రం మండలం పరిధిలోని వేపలపర్తి గ్రామంలోని పాఠశాలలో పని చేస్తూ ఈ సంవత్సరం జూన్ నెలలో ఉద్యోగ విరమణ పొందారన్నారు. ఇంకా తన కుమార్తె వైష్ణవి, కుమారుడు సాయి శబరీష్ ఎంటెక్ చదివి బెంగళూరులో హార్డ్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడన్నారు. కాగా అప్పటితో పోల్చుకుంటే ఇప్పుడు ఉపాధ్యాయులకు అనేక సౌకర్యాలు ఉన్నాయన్నారు. ఇప్పుడు ఉన్నన్ని సౌకర్యాలు లేకపోయినా తాము ఏం బోధిస్తే పిల్లలు అదే వినేవారన్నారు. తమ వద్ద చదువుకున్న పిల్లలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఉద్యోగాలు పొందారన్నారు. మరి కొంతమంది లెక్చరర్స్‌గా ప్రభుత్వ కళాశాలల్లో పని చేస్తున్నారన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం ఒక ట్రస్టు ద్వారా పేద పిల్లలకు వృద్ధులకు వికలాంగులకు సేవ చేయాలని సంకల్పించినట్టు తెలిపారు.

ముస్లిములకు అండగా టిడిపి

పామిడి : రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మైనారిటీలకు అండగా ఉంటుందని గుత్తి మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ కొట్టం మాలిక్‌బాషా అన్నారు. ఇటీవల గుత్తి మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన మాలిక్‌బాషా శనివారం పట్టణ టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్, యువనేత ఈశ్వర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ముస్లిములు మాట్లాడుతూ టిడిపికి ఎల్లప్పుడూ ముస్లిములు అండగా ఉంటారన్నారు. అదేవిధంగా పార్టీ కూడా అంతే అండగా ఉంటుందన్నారు. మాలిక్‌బాషాకు పదవి వచ్చేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే జయరామ్, ఆయన తనయుడు ఈశ్వర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కత్రిమల ప్రభాకర్‌చౌదరి, పామిడి సింగిల్‌విండో ప్రెసిడెంట్ బొల్లు శ్రీనివాస్‌రెడ్డి, జింకల సంజీవకుమార్, గౌస్, టౌన్ కన్వీనర్ బొమ్మామోహన్, మండల కన్వీనర్ సురేష్‌రెడ్డి, వెల్డింగ్ బాబా, రహిమాన్, కొండాపురం రఫీ, హుస్సేన్‌పీరా, హుస్సేన్, జనసేన సుబ్బు, జనసేన షేక్షావలి, పూజారి లక్ష్మీదేవి, దాదా, రాము, కుమార్, శ్రీరాములు, తిమ్మప్ప, బాబావలి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

అనంతపురం : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని డిఎంహెచ్ఒ ఇబి దేవి సూచించారు. స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ జిల్లా కార్యాలయ ఆవరణలో కార్యాలయ సిబ్బందితో కలిసి శుభ్రం చేయడంతోపాటు మొక్కలు నాటారు. ఇందులో భాగంగా సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ పరిపాలన అధికారి గిరిజా మనోహర్ రావు, మలేరియా అధికారి ఓబులు, డాక్టర్ నరేంద్రరెడ్డి, హెచ్ఇఇఒ నాగరాజు, డెమో త్యాగరాజ్, ఆరోగ్య బోధన అధికారి గంగాధర్, పిఎంఒ నాగన్న, బలరామ్‌రెడ్డి, ఎన్‌హెచ్ఎం కిషోర్, సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

అంజన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు

బొమ్మనహాల్ : శ్రావణమాసం ఆఖరి శనివారం, అమావాస్యను పురస్కరించుకుని మండల పరిధిలోని నెమకల్లు ఆంజనేయస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఇందులో భాగంగా స్వామివారికి కుంకుమార్చన, సువర్ణ కిరీటం, వెండి కవచం, పసుపు, కుంకుమ, తమలపాకుల పూజలు చేశారు. భారీగా విచ్చేన భక్తులకు ఆలయం తరపున ఉచితంగా ప్రసాదం ఏర్పాటు చేసినట్లు అన్నదాన కమిటీ అధ్యక్షుడు తిప్పేస్వామి పూజారి తెలిపారు. భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో దాదాపు స్వామి దర్శనానికి రెండు గంటలు పట్టింది.

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం : ఆర్డీవో

ప్రజాశక్తి-అనంతపురం



అనంతపురంలో పోస్టర్లను విడుదల చేస్తున్న ఆర్‌డిఒ, అధికారులు

లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమని ఆర్డీవో కేశవనాయుడు అన్నారు. శనివారం అనంతపురం ఆర్డీవో కార్యాలయంలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టంపై డివిజనల్ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత లేని డాక్టర్లు వైద్యం అందించడం ద్వారా మరణాలు జరిగే అవకాశం ఉందన్నారు. అలాంటి వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా గుట్టుచప్పుడు కాకుండా జరుగుతున్న బాల్య వివాహాలను నివారించాలన్నారు. అనంతరం 'బాల్య వివాహ రహిత భారతదేశం, ఆడపిల్లగా నాకు బతికే హక్కు ఉంది' అనే గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డ్రగ్ ఇన్స్‌పెక్టర్ మాధవి, ఎన్జీవో ప్రెసిడెంట్ భానుజ, సబ్ డివిజినల్ పోలీస్, సి.రుసేంద్రబాబు, ఎపిపి తరపు ఎం.నాగేశ్వరి, ఆర్డీటీ మెడికల్ డైరెక్టర్ దుర్గేష్, పీడియాట్రిక్స్ హెచ్ఒడి డాక్టర్ రవికుమార్, గైనకాలజిస్ట్ హెచ్ఒడి డాక్టర్ ప్రతిభా స్రవంతి, డెమో ఎం త్యాగరాజ్, వెంకటేష్, కిరణ్ కుమార్, మానిటరింగ్ కన్సలెంట్ ఆశారాణి, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం టౌన్ : లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమని ఆర్డీవో వసంతబాబు తెలిపారు. శనివారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రాజేష్ ఆధ్వర్యంలో శనివారం ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యులు, ఐసీడీఎస్, వైద్యసిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగనిర్ధారణ పరీక్షలు చేపట్టకూడదని హెచ్చరికలు చేస్తున్నా కొన్నిచోట్ల ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. అలాంటి ఫిర్యాదులు లేకుండా చూడాలని కోరారు. ఈ సమావేశంలో డాక్టర్లు ప్రసన్నభారతి, శశికళ, గిరికుమారి, ఐసీడీఎస్ ఇన్‌ఛార్జి సిడిపిఒ రాధ, హెల్త్ అసిస్టెంట్ జాన్సన్, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డ్ అభివృద్ధికి కృషి

గుత్తి : వ్యవసాయ గుత్తి మార్కెట్ యార్డ్ అభివృద్ధికి కృషి చేస్తానని ఛైర్మన్ జి.సూర్యప్రతాప్ అన్నారు. మార్కెట్ యార్డు ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన సూర్యప్రతాప్‌ను శనివారం ఆయన ఛాంబర్‌లో పలువురు నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ మోడే శ్రీనివాస్ యాదవ్, మాజీ సర్పంచి ఎ.నరసింహులు, నాయకులు నరేంద్రయాదవ్, కొత్తపల్లి రామాంజనేయులు, రామయ్య యాదవ్ పాల్గొన్నారు.

క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు

అనంతపురం : హెచ్ఐవి, ఎయిడ్స్, సుఖ వ్యాధులు, కౌమార ఆరోగ్యం, డ్రగ్స్ వాడకం వల్ల జరిగే అనర్థాలపై అవగాహన కల్పించేందుకు శనివారం నగరంలోని ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో క్విజ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఒకేషనల్ ఎడ్యుకేషనల్, ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి వెంకటరమణ నాయక్, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ అనుపమ జేమ్స్, ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గురుప్రసాద్, ఆర్ఆర్‌సి నోడల్ అధికారి ఉషాకుమారి, ఎయిడ్స్ నియంత్రణ క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ వెంకటరత్నం, సూపర్‌వైజర్ రమణ, మురళి, రిడ్స్ పియు ప్రాజెక్ట్ మేనేజర్ నరేష్ బాబు, శివారెడ్డి, విశ్వనాథ్, జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్లు, లెక్చరర్లు పాల్గొన్నారు.

పింఛన్లను పునరుద్ధరించాలి

కార్యాలయం వద్ద బాధితుల ఆందోళన

ప్రజాశక్తి-గుత్తి

మండల వ్యాప్తంగా అన్యాయంగా తొలగించిన పింఛన్లు పునరుద్ధరించాలని లబ్ధిదారులు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయంలో పింఛన్లు తొలగించిన లబ్దిదారులు ఆందోళన చేశారు. మండలంలోని తొండపాడు, అనగానిదొడ్డి, ధర్మాపురం, పెద్దొడ్డి, కొత్తపేటతో పాటు పలు గ్రామాలకు చెందిన పలువురు పింఛనుదారులు కార్యాలయానికి వచ్చి అధికారులతో వాగ్వాదానికి దిగారు. గత కొన్నేళ్ల నుంచి వృద్ధాప్య, దివ్యాంగ పింఛన్లు తీసుకుంటున్నామని ఇప్పుడు ఉన్న ఫలంగా ఎందుకు తమ పింఛన్లు తొలగించారని వారు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తొలగించిన తమ పింఛన్లను వెంటనే పునరుద్దరించాలని వచ్చే నెల నుంచి తమకు పింఛన్ల సొమ్ము ఇవ్వాలని డిమాండ్ చేశారు. తొలగించిన పింఛన్లను పునరుద్దరించని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని వారు అధికారులకు హెచ్చరించారు. ప్రభుత్వం నుంచి తమకు తొలగించిన పింఛన్లజాబితా వచ్చిందని వాటిని మాత్రమే తాము అమలు పరిచామని తమ చేతుల్లో ఏమి లేదని అధికారులు పింఛనుదారులకు వివరించారు.

కలెక్టర్ దృష్టికి సమస్యలు : సిపిఎం

ప్రజాశక్తి-పుట్లూరు

స్వరాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు పుట్లూరకు శనివారం విచ్చేసిన కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ దృష్టికి మండల సమస్యలను సిపిఎం నాయకులు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి సూరి మాట్లాడుతూ పుట్లూరు మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీ కాలువలు ఏర్పాటు చేయాలన్నారు. కడవకల్లు గ్రామంలో రోడ్లు, డ్రెయినేజీలను మరమ్మతు చేయాలన్నారు. కస్తూరిబా, మోడల్ స్కూళ్లు, బీసీ హాస్టల్‌లో నీటి సమస్య ఉందన్నారు. కడవకళ్లు జెడ్పీ హైస్కూల్లో లోవోల్టేజీ సమస్య కారణంగా ఇబ్బందులున్నాయని ఇక్కడ అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని కోరారు. మండల వ్యాప్తంగా వికలాంగుల పింఛన్లు ఏ ఒక్కరివీ తొలగించకుండా అందిరికీ యథావిధిగా ఇవ్వాలన్నారు. ఇళ్లు లేని పేదలకు స్థలాలు మంజూరు చేసి ఇంటి నిర్మాణాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి టి.పెద్దయ్య, నాగభూషణ్, జె.పెద్దయ్య టి.ఆదినారాయణ వి.కుళ్లాయప్ప పాల్గొన్నారు.

డీలర్ల సమావేశం

పెద్దపప్పూరు : మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో డీలర్ల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. తహశీల్దార్ బాలాజీ రాజు, సివిల్ సప్లయ్ తహశీల్దార్ రాజా ఆధ్వర్యంలో మండలంలోని డీలర్లతో సమావేశం నిర్వహించి రేషన్ పంపిణీపై చర్చించారు. రేషన్ పంపిణీలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ డీలర్లను హెచ్చరించారు. వచ్చే 6వ తేదీ నుంచి కొత్త రేషన్ కార్డులు పంపిణీ చేస్తామన్నారు.

నేరాలు ఘోరాలు

మహిళ ఆత్మహత్య



మృతిచెందిన రాజమ్మ

నార్పల : మండల పరిధిలోని బొందలవాడ గ్రామానికి చెందిన కాటమయ్య భార్య రాజమ్మ (25) మాలవాండ్లపల్లి పొలాల్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రాజమ్మ కొద్దికాలంగా మానసిక స్థితి సరిగా లేక అనారోగ్యంతో బాధపడేది. ఇందులో భాగంగా అనంతపురంలోని ఓ మైండ్ కేర్ ఆస్పత్రిలో చికిత్స కూడా తీసుకుఇంది. ఈనేపథ్యంలో శుక్రవారం ఉదయం నుంచి రాజమ్మ కనిపించకుండా పోయింది. దీంతో రాజమ్మ తల్లి, భర్త పోలీసులకు ఫిర్యాదు చేసి పలుప్రాంతాల్లో వెతికారు. ఈనేపథ్యంలో శనివారం ఉదయం మాలవాండ్లపల్లి పొలాల్లో గుర్తు తెలియని మహిళ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుందని ట్రాక్టర్ డ్రైవర్ రాజు తెలపగా అక్కడకు వెళ్లి పరిశీలించారు. ఆత్మహత్య చేసుకుంది రాజమ్మగా గుర్తించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని అనంతపురం తరలించారు. మృతురాలి తల్లి బూసి లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సాగర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

గుత్తి : మండలంలోని లచ్చానుపల్లి గ్రామ శివారులో శనివారం ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడి ముగ్గురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గుత్తి ఆర్ఎస్ కు చెందిన శేఖర్, ఆదిలక్ష్మి, దేవి పని నిమిత్తం లచ్చానుపల్లికి వెళ్లారు. పని ముగించుకొని ద్విచక్రవాహనంలో తిరిగి వస్తుండగా గ్రామ శివారులోని మలుపు వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో గాయపడిన ముగ్గురిని వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

పెద్దవడుగూరు మండలం ఆవులాంపల్లి గ్రామానికి చెందిన ఆంజనేయులు అనే వ్యక్తి శనివారం కట్టెలు కొడుతుండగా కొడవలి తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడు తెలిపిన వివరాలిలా మేరకు ఆవులాంపల్లి గ్రామానికి చెందిన రైతు ఆంజనేయులు తన ఇంటి వద్ద కట్టెలు కొడుతున్నాడు. అయితే బలంగా కొడుతున్న సమయంలో కొడవలి ఆంజనేయులు కాలికి బలంగా తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన అతడిని వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్సలకు అనంతపురం తీసుకెళ్లారు.

గిరిజనులపై దాడులను అరికట్టాలి

ఉరవకొండ : నియోజకవర్గంలో దళితులు, గిరిజనులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని వైసిపి పట్టణ ఎస్టీ సెల్ కార్యదర్శి కోలే గుండ్ల శేఖర్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ముఖ్యంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దళితులు, గిరిజనులపై దాడులు అధికమయ్యాయన్నారు. మండల పరిధిలోని లత్తవరం తండాలో వైసిపి కార్యకర్త ప్రసాద్‌నాయక్‌పై టిడిపి కార్యకర్త తులసి, నాయకులు చేసిన దాడి బాధాకరమన్నారు. వెంటనే నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

పెన్నోబులేశుడికి వైభవంగా పల్లకిసేవ

ఉరవకొండ : మండలం పెన్నఅహోబలంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామికి శనివారం సాయంత్రం పల్లకిసేవ నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం నుంచి స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సహిత శ్రీవారి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి సాకే రమేష్‌బాబు, అర్చకులు, ఆలయ సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ మోటార్ వితరణ

యాడికి : మండలంలోని వేములపాడు సొసైటీ సింగిల్‌విండో అధ్యక్షులు నాగమునిరెడ్డి రూ.15వేలు విలువజేసే విద్యుత్ మోటార్‌ను శనివారం వితరణ చేశారు. ఈమేరకు మోటార్‌ను తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ప్రతాపరెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కిష్టప్ప, వీఆర్వో దామోదర్ నాయుడు, తెలుగు యువత నాయకుడు కోడూరు నీలకంఠారెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దమ్మ తల్లి విగ్రహానికి ప్రాణప్రతిష్టాపన

యల్లనూరు : మండలం కేంద్రంలోని ఎస్సీ కాలనీలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మ తల్లి అమ్మవారి ఆలయంలో ప్రాణప్రతిష్టాపన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.

'సురవరం' మృతి బాధాకరం

రాయదుర్గం : సిపిఐ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి మృతి బాధాకరమని విప్ కాలవ శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన ఎంతగానో శ్రమించారని గుర్తు చేశారు. అంతేగాకుండా విలువలతో కూడిన ఆయన జీవితం ఎందరికో ఆదర్శమన్నారు. తాను 1999లో పార్లమెంటు సభ్యుడిగా ఎన్నికైన తరువాత ఢిల్లీకి వెళ్లినప్పుడు తనను తమ ఇంటికి ఆహ్వానించి భోజనం పెట్టి ఎంపీగా ఎలా మసలుకోవాలో సుధాకరరెడ్డి సూచనలు చేశారని గుర్తు చేశారు. ఆయన మరణం అత్యంత బాధాకరమన్నారు.

ఆంజనేయస్వామి రథోత్సవం

రాయదుర్గం : పట్టణంలోని జాతీయ రహదారి చెక్‌పోస్ట్ వద్ద శనివారం అభయాంజనేయస్వామి రథోత్సవం ఘనంగా జరిగింది. ఇందులో భాగంగా ఉదయం ఆకుపూజ, పంచామృతాభిషేకం, రథాంగ హోమం, మధ్యాహ్నం మడుగుతేరు, అన్నదానం చేశారు. సాయంత్రం 13వ రథోత్సవం నేసేపేటలోని ఉక్కడ ఆంజనేయస్వామి ఆలయం వరకూ సాగింది.

హామీలను అమలు చేయడమే లక్ష్యం

బెలుగుప్ప : ఎన్నికల మందు ఇచ్చిన హామీల్లో భాగంగా సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని టిడిపి జిల్లా కార్యదర్శి బి.మల్లికార్జున, పెద్ద తిప్పయ్య తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన తల్లికి వందనం, ఉచిత గ్యాస్, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు, మెగా డీఎస్సీ వంటి పథకాలకు అపూర్వ స్పందన వస్తోందన్నారు. ఇవి ఓర్చుకోలేని వైసిపి నాయకులు లేనిపోని విమర్శలు చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఆవులన్న సర్పంచు రామ్మోహన్‌చౌదరి, జి.వెంకటస్వామి, ఎర్రిస్వామి, అనిల్, తిప్పేస్వామి, తదితరులు పాల్గొన్నారు.

పివికెకె ప్రాంగణ నియామకాల్లో 27 మంది ఎంపిక

అనంతపురం : అనంతపురం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని పీవీకేకే డిగ్రీ, పీజీ కళాశాలలో శనివారం నిర్వహించిన ప్రాంగణ నియామకాల ఎంపికలో 27 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక అయ్యారు. బీఎస్సీ, బీసీఏ విద్యార్థులు ఇందులో పాల్గొని 27మంది ఉద్యోగాలకు ఎంపిక అయ్యారు. ఎంపికైన వారికి సంవత్సరానికి రూ.3 లక్షల వేతనంతో పాటు భోజనం, రవాణా సౌకర్యం దక్కనుంది. ఈ కార్యక్రమంలో సీనియర్ హెచ్ఆర్ మేనేజర్ హరికృష్ణ, హెచ్ఆర్‌లు రాఘవన్, చంద్రన్, ప్లేస్‌మెంట్ డీన్ డా॥సి.భాను కిరణ్, ప్రిన్సిపాల్ డా॥రాఘవేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల ఛైర్మన్ డా॥పల్లె కిషోర్ అభినందించారు.

స్థలం కేటాయించాలని వినతి

ఉరవకొండ : అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని కోరుతూ ఎస్సీ,ఎస్టీ ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహశీల్దార్ మహబూబ్ బాషాను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. మండల పరిధిలోని చిన్న ముష్టురు గ్రామంలో అనంతపురం-బళ్లారి జాతీయ రహదారి పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాన్ని అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిన్న ముష్టురు జయరాములు, రవి, శివ, మాదినేని రవి, హనుమంతు, చిన్న, మల్లికార్జున, రామాంజనేయులు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలు సంభవిస్తే చర్యలు : డిఎంహెచ్ఒ

అనంతపురం : జిల్లాలో ఎక్కడైనా మాతాశిశు మరణలు సంభవిస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ ఇబి దేవి హెచ్చరించారు. గత జూలై మాసంలో జిల్లాలో జరిగిన ఆరు శిశు మరణాలు, ఇద్దరి మతామరణాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాతాశిశుమరణాలను నివారించాలన్నారు. మాతా మరణాల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ డేవిడ్ సిల్వం రాజు, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి యుగంధర్, మత్తు మందు నిపుణులు డాక్టర్ నవీన్‌కుమార్, చిన్నపిల్లల నిపుణులు ప్రణీత్, స్త్రీవైద్య నిపుణులు పద్మశ్రీ, డిపిహెచ్ఎన్ ఓ ప్రమీలాదేవి, హేమలత, ఐసిడిఎస్ సిడిపిఒలు అనురాధ, ఉమాశంకరమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

చెరువులు, కుంటల్లో చేపలు విడుదల

కళ్యాణదుర్గం టౌన్ : గ్రామాలకు సమీపంలో ఉన్న చెరువులు, కుంటల్లో గంబూషియా చేపలను విడుదల చేసి వ్యాధుల వ్యాప్తికి అడ్డుకట్ట వేస్తున్నట్లు కమిషనర్ వంశీకృష్ణభార్గవ్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రాజేష్ తెలిపారు. మలేరియా సబ్‌యూనియట్ ఆఫీసర్ తిరుపాలయ్య ఆధ్వర్యంలో శనివారం కళ్యాణదుర్గం సమీపంలోని ఊరుచెరువులో గంబూషియా చేపలను వదిలారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ చేపలను వదిలితే లార్వా ఉత్పత్తి కాకుండా నివారించవచ్చన్నారు. డెంగీ, మలేరియా, చికన్ గున్యా లాంటి వ్యాదులు వ్యాప్తి చెందకుండా అరికట్టడానికి దోహదపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ధరమ్‌సింగ్, జాన్సన్, గంగరాజు, వీరశేఖర్, పురుషోత్తం, హనుమంతరాయుడు, గోవిందరాజులు, విజయ్, రెడ్డప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యునికి సన్మానం

కళ్యాణదుర్గం టౌన్ : ఇటీవల జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో అవార్డు పొందిన కళ్యాణదుర్గం రెవెన్యూ విడివిజన్ పరిధిలోని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానటరింగ్ కమిటీ సభ్యుడు మోహన్‌ను ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు శనివారం స్థానిక ప్రజావేదికలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నాయకుడు అనిల్‌చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల క్రాస్ వద్ద అన్నదానం



అన్నదానం చేస్తున్న దృశ్యం

శింగనమల : శోధనపల్లి ఈడిగ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో శింగనమల క్రాస్ వద్ద శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. శ్రావణ శనివారంను పురస్కరించుకుని అన్నదానం ఏర్పాటు చేసినట్లు రామ్ చరణ్ యాదవ్ తెలిపారు. శింగనమల క్రాస్‌లో ఉన్న ఋషి శృంగ మహాముని శ్రీ రంగరాయల వారి జ్ఞాపకార్థం అన్నదాన కార్యక్రమాన్ని ప్రతి శనివారం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగా ఈడిగ కృష్ణమోహన్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఈ కార్యక్రమం చేపట్టారన్నారు.

అంబులెన్స్-ఆటో ఢీ.. ఐదుగురికి గాయాలు

గుత్తి : పట్టణంలోని అటవీ శాఖ కార్యాలయం ఎదురుగా శనివారం సాయంత్రం ప్రవేట్ అంబులెన్స్ ఆటో ఢీకొన్న ఘటనలో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానిక స్వస్థత శాలకు వెళ్లే ప్రయాణికుల ఆటో అటవీ శాఖ కార్యాలయం ఎదురుగా రహదారిపై వెళ్తుండగా ఆటో ప్రయాణికుడు దిగడానికి సడన్ గా డ్రైవరు బ్రేక్ వేయడంతో వెనక వైపున వెళ్తున్న ప్రైవేటు అంబులెన్స్ ఢీకొంది. ప్రమాదంలో నంద్యాల జిల్లా డోన్ పట్టణానికి చెందిన ఆటోడ్రైవర్ ఖాజావలి, ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలం కొండపేట గ్రామానికి చెందిన నరసింహ, తిరుమల, అంబులెన్స్ డ్రైవర్ లక్ష్మణ్, వేణుకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. మెరుగైన వైద్యం కోసం క్షతగాత్రులను అనంతపురం, కర్నూలు ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఘటనపై పోలీసుల కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



జెఎన్‌టియులో ఆంధ్ర కేసరి ప్రకాశం పంతులుకు నివాళి అర్పిస్తున్న సిబ్బంది

ఆంధ్రకేసరికి నివాళి

ప్రజాశక్తి-అనంతపురం

ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని పురస్కరించుకుని శనివారం అనంతపురంలోని జెఎన్‌టియు పరిపాలన భవనంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉపకులపతి హెచ్.సుదర్శనరావు మాట్లాడుతూ ప్రకాశం పంతులు 1946లో ఆంధ్ర రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రిగా పని చేసి ఎన్నో సంస్కరణలను తీసుకొచ్చారని గుర్తు చేశారు. ప్రకాశం పంతులు సైమన్ కమిషన్ బహిష్కరణ ఉద్యమంలో పోలీసుల తుపాకీకి ఎదురు నిలిచి ధీరోదాత్తులుగా నిలిచారన్నారు. అలాంటి ఆయన్ను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. అలాగే ఇంజినీరింగ్ కళాశాలలో కూడా ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి, ఒఎస్‌డి వీసీ ఎన్.దేవన్న, యూనివర్సిటీ డైరెక్టర్లు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

గుత్తి : ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 153వ జయంతి వేడుకలు శుక్రవారం గుత్తిలో ఏపీ రాష్ట్ర పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. పట్టణంలోని పెన్షనర్ల భవనంలో అదనపు కార్యదర్శి జేన్నే కుళ్లాయిబాబు, ఉపాధ్యక్షురాలు స్వర్ణాంబ లు ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్యదర్శి కె. రామ్మోహన్,నాయకులు పక్రుద్దీన్, షేక్షావలి, వెంకటేష్, హసన్‌అహ్మద్, చెన్నారెడ్డి, నారాయణశెట్టి దేవదాసు, శామ్యూల్, రామదాసు, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పండుగ చేసుకోవాలి

ప్రజాశక్తి-రాయదుర్గం

వినాయక చవితి, మిలాద్ ఉన్ నబి పండుగలను ప్రశాంతంగా చేసుకోవాలని పోలీస్‌ఇన్స్‌పెక్టర్ జయనాయక్ సూచించారు. శనివారం రాయదుర్గంలోని పోలీస్‌స్టేషన్‌లో ముస్లిం మత పెద్దలతో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జయ నాయక్ మాట్లాడుతూ రాబోయే వినాయక చవితి, మిలాదున్నబీ పండుగల సమయంలో పోలీసులు, హిందువులతో ముస్లిములు సహకరించాలని కోరారు. ప్రస్తుతం పట్టణంలో ప్రశాంత వాతావరణం కొనసాగుతోందని, అదేవిధంగా భవిష్యత్తులో కూడా ఉండాలని ఆశాభావం వ్యక్తం చేశారు. రాయదుర్గంలో ఇప్పటి వరకూ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదని, ఇకముందు కూడా జరగవని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మతపెద్దలు, ప్రభుత్వ ఖాజీలు మహమ్మద్ సైపుల్లా, అతావుర్ రహమాన్, పట్టణ మసీదు ప్రెసిడెంట్లు కమిటీ సభ్యులు సనావుల్లా ,సునార్, మాజీద్ , జువెలరీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఘని, అహ్మద్ హుస్సేన్, మహమ్మద్ రఫీక్, సమీవుల్లా, భాషా, మహమ్మద్ షఫీ, తదితరులు పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-బెలుగుప్ప

ప్రతి ఒక్కరూ పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని ఎంఇఒ హరికృష్ణ సూచించారు. జిల్లా ఉప విద్యాశాఖ అధికారి మల్లారెడ్డి సూచనల మేరకు శనివారం మండల కేంద్రంలో పొగాకు ఉత్పత్తుల వల్ల కలిగే అనార్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ పొగాకు ఉత్పత్తులను వాడటం వల్ల తలనొప్పి, ఊపిరితిత్తులు పాడవడంతోపాటు అతి ప్రమాదకరమైన ఊపిరితిత్తుల క్యాన్సర్, మెదడుకు సంబంధించిన వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. కావున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం ఈ సిగ్నేచర్ క్యాంపెయిన్‌లో చురుగ్గా పాల్గొన్న బెలుగుప్ప ఉన్నత పాఠశాల విద్యార్థిని బి.నిఖితకు ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయురాలు స్వర్ణలత ప్రోత్సాహకం అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శివ, ప్రధానోపాధ్యాయులు వెంకట ప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయుడు గోవింద్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సెలవు దినాల్లో ఉద్యోగులను ఇబ్బంది పెట్టొద్దు

యల్లనూరు : నియోజకవర్గంలోని ఉద్యోగులను సెలవు దినాల్లో ఇబ్బందులు పెట్టొద్దని ఎంఆర్‌పిఎస్ నాయకులు కోరారు. ఈమేరకు శనివారం మండల కేంద్రంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పిఎస్ నాయకులు పూజారి నరసింహుడు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు సోమవారం నుంచి శనివారం వరకూ విధులు నిర్వహించుకొని ఆదివారం కుటుంబంతో గడపడానికి ఉత్సాహం చూపుతారన్నారు. అలాంటి ఉత్సామాన్ని ఎమ్మెల్యే సమావేశాలు అంటూ లేకుండా చేయడం దుర్మార్గమన్నారు. ఉద్యోగులు కుటుంబంతో ఒక్కరోజు గడపడం ఎమ్మెల్యేకు ఇష్టం లేన్నట్టు ఉందని ఆరోపించారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే, ఉన్నతాధికారులు స్పందించి సెలవు దినాలల్లో సమావేశాలను రద్దు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

క్యాన్సర్ వ్యాధిని ఆదిలోనే అరికడదాం

కళ్యాణదుర్గం టౌన్ : క్యాన్సర్ వ్యాధిని మొదటి దశలోని గుర్తించి ఆదిలోనే అరికడదామని జిల్లా అధికారి డాక్టర్ నారాయణస్వామి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సీహెచ్‌సీలో క్యాన్సర్ వ్యాధి నివారణపై వైద్యాధికారులకు రెండవ రోజు శిక్షణ కొనసాగింది. ఇందులో భాగంగా నోరు, రొమ్ము, గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్‌పై హాండ్స్ ఆన్ ట్రైనింగ్ స్పెషలిస్టులతో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజేష్, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.